# రవణ సాహసము ★ శ్రీ పతాభి

పాపం రవణకు దూరంలో ఉత్తరాదిన సంబంధం కుదిరింది. వరుడగు బ్రహ్మయ్యకు ముదురు వయస్సు. అతగాడికిది ద్వితీయ వివాహము. రవణ, తనకున్న లేబ్రాయము, అసాధారణమగు అందము ముదుసలి బ్రహ్మయ్యకు ధారపోయవలసిందేన? పాపం రవణ! తనమాటలువినేవాళ్లు ఎవరున్నారు? తనవూరిలోని పలానా సుందరయ్యను వివాహమాడ వలయుననేటి తన కోరికను బహిరంగ పరిస్తే అందరూ ఏమనరు? తన్ను నోటికివచ్చినట్లు తిట్టి పోస్తారు. తన్నుకులటల్లో జేర్చివేస్తారు. అసలు తన వివాహాన్నిగూర్చి మాట్లాడుటకు, చర్చించుటకు తన కేమిహక్కుంది. ఓప్రాణాన్ని వేలంవేస్తూవుంటే, ఆ ప్రాణానికి, ఆ వ్యాపారంలో ఏం బాధ్యతవున్నది, విక్రయింపబడినవారికి బండచాకిరిచేయడం తప్ప.

అయితే రవణకు ఓ సంగతి మనఃశాంతిగా వుండింది. తనకోసరం పుట్టింటివారు, వరునికి చాలా కట్నాలిచ్చి తర్వాత దివాలాతీయటం లేకుండా; బ్రహ్మయ్యే, తన తండ్రికి నాలుగువేల రూపాయి లిస్తాడు. తనమీద బ్రహ్మయ్యకంత మక్కువకాబో లును...అనేకవేల రూపాయల ఖర్చుజేసి బ్రహ్మయ్య డీలక్సు సోఫాలు పట్టెమంచాలు ఇటీవలనే తీసుక వచ్చాడు దానుగట్టించిన నూతన మహలునకు. ఇప్పుడీ నాలువేలు అతగాడికేమంతలోటు? ఇంకా లాభమే అతనికి. రవణ డీలక్సు సోఫాలకన్నగూడ అనేక రకాల ఉపయోగంకదూ!

*

వివాహం జరిగింది. చుట్టుపక్కల అమ్మలక్కలు రవణమ్మభాగ్యం పండిందన్నారు. అమ్మో! బ్రహ్మయ్యకు రవలంటుపోగులు! సరిగంచు పంచెలు! వేళ్లకు వజ్రాల ఉంగరాలు! నిజంగా రవణమ్మ ఏం పుణ్యంజేసి పుట్టింది! బ్రహ్మయ్యవాళ్లు ఉత్తరాదికి పోయారు. పదిహేనురోజులు తర్వాతగాని రవణకు అత్తవారింటికి పంపకాలు జరుగవు. విధి హస్తాలలోకి, తన్ను వదిలివేసుకున్నది రవణ నిరాశతో.

రోళ్లుపగిలేటి రోహిణీకార్తె! ఊళ్లోనిబావులు క్రీనీళ్లతోసహా ఎండిపోయినవి. ఊరికి ఉత్తరాన ఫర్లాంగు దూరంలోగల మడుగునకు పోయేవారందరు మంచినీళ్లకు. సాయంత్రం ఏడుగంటలయినది, కుండల్లో నీళ్లుపట్టుకపోయారందరు. రవణమటుకు ఆ మడుగు గట్టున ఏదో ఆలోచిస్తూ కూర్చొనున్నది.

తామరపూవులన్నీ మూసుకపోయి యున్నవి. జాబిల ప్రతిబింబము, గడ్డకట్టిన నిరాశలాగా జలాంత రంగలో గన్పిస్తుంది. తన ప్రతిబింబముగూడా విషాద సాగరంలో మునిగి తనలాగే అగుపడింది రవణకు. ఆప్రతిబింబము తన్ను ఆహ్వానించుచున్నట్లుగాగూడా భ్రమించింది రవణ. ఆయమ కన్నుల్లోనుండి జారి కన్నీటిచుక్క నీళ్లలో బడినది. అది వలయాల గట్టి నది. కలగిన ఆ వలయాల మధ్య ఓ అస్పష్టమూర్తి కానబడినది రవణకు. చకితయై తలపయికెత్తిచూచినది. కలగిన తన హృదయమ్ము మధ్యగల సుందరయ్యమూర్తి అస్పష్టంగా, గగనానికి అమర్చబడ్డా. అన్నట్లుల, గంభీ రంగా కనపట్టింది :—

సుందరయ్యను జూచింది. చూచి తలవ్రాల్చింది. మడుగులోని చంద్రుని ప్రతిబింబము, పక్కన నవ్వు తున్నట్లు కనబడింది. సుందరయ్య సన్నిధానము నుండి పరుగిడి పోవాలనుకొన్నది రవణ కానీ కాళ్ళాడనీయ శక్తి నిల్పియుండినది.

సుందరయ్య నిమ్మళంగా తన వంకకు పాదం వేస్తున్నాడు. రోమాంచము చేత రవికముడి, తనంత వీడిపోయింది. సుందరయ్య మాట్లాడ లేదు. వంగి రవణను దట్టమ్ముగా కవుగిలించాడు. రవణ ఆ అనలేదు. ఊఅనలేదు. పండుమామడికాయ రంగుగల ఆమె దేహం మీద, వేయి చిరుముద్దుల పగడాలజల్లు కురిపించాడు. రవణ వివశయయి పోయింది: కన్నులమూసింది. ఉచితా నుచితములకు, సంఘపు మూఢనిబంధనలకు కన్నుల మూసింది రవణ....

ఆకాసార తీరమున, ఆమసక చీకట్లుముసుగుల సందున, ఆ పలుచవెన్నెల సమయాన రవణ తన కన్య

త్వమును, సుందరయ్యకు సమర్పించింది. అటునుండి యకాయకి ఇంటికి వచ్చివేసింది. పూనిన మనిషి వచ్చులాగా, విడిన జడతోను, చెమ్మటలు గ్రమ్మిన ఒడలుతోను, తొట్రిలుచున్న నడకతోను, ఇలు చేరింది ఇంటివారు సందేహ పడకుండేటట్టుగా ఏదో కల్లజెప్పి తప్పించుకొన్నది. అకలంక స్వభావానికి, సత్యసంధతకు రవణకు చిన్నప్పటినుండి పేరు. రవణకూడా చాలా పొరబాటు జరిగినదని గ్రహించినది. కానీ తన కర్ణాలలో సుందరయ్య కడామాటలు, "నీకోసరం శివాలయపు మామిడితోటలో వేచియుంటాను రేపు సాయంత్రం" అనేవి మారుమ్రోగుతూన్నవి. అచ్చోటికి ఇక పోగూడదని నిశ్చయించుకొన్నది.

*

మరునాటి సాయంత్రం తానెంత పోగూడదనుకొనుచున్నను తన దేహంలోని ప్రతి అణువు సుందరయ్య పరిష్వంగానికి రోదిస్తూండినది. పాపం రవణ మట్టుకు ఏంజేయగలదు! స్వయంగా పోయి సుందరయ్యతో ఈ వ్యాపారము ఇక సాగించుట ధర్మము గాదని జెప్పివస్తా మనుకొన్నది. సాయంత్ర ఏడు గంటలప్పుడు శివాలయపు మామిడి తోటన రవణ, సుందరయ్య కడకు వచ్చింది. అతగాడిని చూశేసరికి తన నియమము సడలిపోయినది. "ఇంతదూరం సాహసంజేసి వచ్చానుగదా, కడసారి ఇతనితో క్రీడించి, పోయేటప్పుడు చెప్పిపోదా మనుకొన్నది.

పోయేటప్పుడు, సుఖ స్వప్నములు గాంచు సుందరయ్యతో ఇప్పుడేలా కటువుగా జెప్పటం? రేపు ఎవరిచేతనేని జాబు పంపిస్తానులే రావద్దని ఆలోచించి పలుకకుండా వెళ్ళిపోయింది. కాని మరునాడు, ఎవరిచేతనయినా జాబును పంపిస్తే ఏమన్నా ప్రమాదము జరుగవచ్చును కనుక స్వయంగా పోయి జాబునుఇచ్చి వస్తామని తలంచింది రవణ. అదే సమయానికి మామిడితోపులోన హాజరయింది రవణ. అతన్ని పోయేటప్పుడు ఇచ్చిపోతా మనుకొన్నది జాబు. కానీ పోయేటప్పుడు ఇవ్వలేకపోయింది. రేపటినుండి రాకుంటేనే సరిపోతుందిలే అని అనుకొని జాబివ్వకుండానే వెళ్ళిపోయింది.

కానీ అది రవణకు సాధ్యంగాలేదు. నిరాఘాటంగా మహా సాహసంతో సుందరయ్యదగ్గరకువచ్చి పోతూన్నది రవణ.

నాడు ఉత్తరాదినుండి బ్రహ్మయ్య రాబోతాడు రవణను అత్తగారింటికి తీసుకపోడానికి. ఇంతలో రవణకు!—జడంతా వీడిపోయి అర్ధనగ్నాంగమ్ముమీద, పిచ్చివాడు బొగ్గుతోగీసే బొమ్మల్లాగా పడివుంది. చేతిలోని గాజులు పగిలిపోయి దేహానికి గీసుకొన్నందు వల్న రక్తంగూడా వస్తూవున్నది. రవణకు దయ్యం పట్టింది. నోటికివచ్చినట్టుల ప్రేలుతూవుండినది. మంత్రవేత్తలుగూడా మాన్పలేకపోయారు. బ్రహ్మయ్యవచ్చి, భార్యను తీసుకపోకుండానే ఉత్తరాదికి తిరిగి పోయాడు.

తర్వాత రవణకు దయ్యం పోయింది. రహస్యంగా పోయి సుందరయ్యతో క్రీడించేది. మరలా ఓ మాసంరోజులకు, భార్యను తీసుకపోడానికి బ్రహ్మయ్య వచ్చాడు. మళ్లీ అదేమాదిరిగా రవణకు దయ్యంబట్టినది. మరోసారిగూడా బ్రహ్మయ్య వచ్చాడు. ఈసారిగూడా దయ్యం పూనింది రవణకు. వివాహమయి నాలుగుమాసములయినది. ఇంతవరకు అత్తవారింటికి పోలేదు. ఈసారి బ్రహ్మయ్యవస్తే, రవణకు దయ్యంపట్టి కల్లోలపరచినా గూడ, కాళ్లు జేతులు కట్టివేశయిన అత్తవారింటికి పంపించదలచుకొన్నాడు రవణతండ్రి. దానికితోడు బ్రహ్మయ్యగూడా చాల్లా పోరుజేశాడు. తనవూరిలోని యింగ్లీషు డాక్టర్లకు చూపించవచ్చును తనభార్యను తనఇంటికి పంపమన్నాడు.

*

బ్రహ్మయ్య వచ్చాడు. ఈసారి రవణకు దయ్యం బట్టలేదు. అందరికి చాలా సంతోషమయింది. ఊళ్లో అంతా రవణమ్మ రేపు అత్తవారింటికి పోతుంది అని తెలిసిపోయింది. సుందరయ్యకుకూడా తెలిసింది. కానీ ఏంజేస్తాడు.

మరునాడు చీకటితోనే లేచింది రవణ. మడుగు చాయబడిపోయింది.

ప్రొద్దున్నే మంచినీళ్లకు మడుగునకుబోయిన అమ్మలక్కలు, రవణ కళేబరాన్ని చూశారు.

రక్తవర్ణంపట్టిన తామరపూవులు కన్నులు విప్పినవి.